క్లుప్తంగా

విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి



పాఠశాలను సందర్శించిన ఎంఈఓ సరళ

నర్సంపేట : ఉపాధ్యాయులు విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని చెన్నారావుపేట ఎంఈఓ సరళ అన్నారు. మండలంలోని బోజెరువు(బొజ్జాయిలు) ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎర్ర రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో ఉత్తరాషాఢ నక్షత్రంలో అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వంగేటి గోవర్ధన్ పద్మావతి, కిరణ్ దీప్తి కుటుంబ సభ్యులతో పూజలో పాల్గొనగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా, ఆలయ అధ్యక్షుడు సైఫా సురేష్, దొడ్డ రవీందర్, చంద్రశేఖరం, శ్రీరాంతఈశ్వరయ్య, వీరలింగం, సదానందం, రవీందర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నర్సంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నర్సంపేట కార్యవర్గం ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం విఫలమైందన్నారు.

అదుపు తప్పి పడిపోయిన వ్యక్తి

వర్ధన్నపేట : అపస్మారక స్థితిలో రోడ్డుపైన ఓ వ్యక్తి పడి ఉన్న సంఘటన వరంగల్–ఖమ్మం రహదారిలోని ఇల్లంద–కట్ర్యాల మధ్య చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లంద గ్రామానికి చెందిన కోల రాజు బైక్‌పై వస్తూ ఇల్లంద–కట్ర్యాల మధ్య అదుపుతప్పి పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉండగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

'చెట్లు తొలగిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి'

వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధి జగ్గుపేట ప్రాంతంలో కొందరు వ్యక్తులు రోడ్డు కిరువైపుల ఉన్న మొక్కలు, చెట్లను తొలగిస్తున్నారు. అయితే అధికారులు పట్టించుకోవడం లేదని సమీప రైతులు, స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పర్యావరణ పరిరక్షణ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి వనమహోత్సవం పేరిట మొక్కలు నాటుతుండగా, కొంతమంది చెట్లను తొలగించడం దారుణం అన్నారు. మొక్కలు, చెట్లను తొలగిస్తున్న వారిని గుర్తించి అధికారులు చర్య తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలపై చర్య తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో నిర్వహిస్తున్న సెయింట్ మేరీ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పాఠశాల ముందు విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, టీజీబీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ సేయింట్ మేరీ పాఠశాలను ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్నారు. కలెక్టర్, డీఈఓలు చర్యలు తీసుకొని పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ, మణితేజ, శ్రీను, నాగరాజు, విజయ్, రవి, రమేష్, కార్తీక్, బన్ని, అరుణ్, రాంబాబు, రాజు, రవి, చందు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు భవన నిర్మాణం జరిగేనా ?

- రూ.2.30 కోట్ల నిధులు మంజూరు
- 2022 నుంచి పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



అశోక్‌నగర్‌లోని కేజీబీవీ

ఖానాపురం : అదనపు భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. విద్యార్థుల సమస్యల పరిష్కారం జరుగుతుందని ప్రజలు సంతోషపడ్డారు. కానీ మంజూరైన నిధుల పరిస్థితి ఏంటో, ఎక్కడ ఆగిపోయాయో తెలియని అయోమయపరిస్థితిలో ఉంది. చాలీచాలని గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అశోక్ నగర్‌లో కేజీబీవీలో ఇంటర్మీడియట్ సైతం ఉంది. ఇందులో 6 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు 300 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో మొత్తం 16 గదులు ఉన్నప్పటికీ ఇందులో ఐదు తరగతి గదులకు, ఐదు డార్మెంటరీలకు, ఇతర గదులు వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడంతో నిత్యం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా భవనం నిర్మాణం కోసం 2022లో నాటి ప్రభుత్వం విద్యాశాఖ నుంచి రూ.2.30 కోట్ల నిధులను మంజూరు చేసింది. మంజూరైన నిధులతో ఇంటర్‌తో పాటు పాఠశాల స్థాయి విద్యార్థులు సైతం వినియోగించుకోవడానికి అదనపు భవనం నిర్మించాల్సి ఉంది. కానీ నాటి నుంచి నేటి వరకు మంజూరైన నిధులు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అదనపు భవన నిర్మాణం చేయించాల్సిన అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజూరైన నిధులతో నిర్మాణానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారులకు తెలియజేశా..

అదనపు భవన నిర్మాణానికి నిధులు మంజూరైన విషయం వాస్తవమే. నిధులు మంజూరైనట్లు ఉత్తర్వులు రావడం జరిగింది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. ఇదే విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేశాను. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– మేనక, ఎస్‌ఓ, అశోక్‌నగర్

కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

నర్సంపేట: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల కొమురయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ వందేళ్ల కాలంలో ఎంతో పోరాడి ప్రాణత్యాగాలు చేసి కార్మిక హక్కులను సాధించుకుంటే ఈ పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక హక్కులను చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల కార్మిక వర్గం, ప్రజానీకం కొనలేని స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు, అసోసియేషన్ ఫెడరేషన్లు పిలుపునిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అనుమకొండ శ్రీధర్, కందికొండ రాజు, నల్లబెల్లి మండల కార్యదర్శి కడియాల మనోహర్, చెన్నారావుపేట మండల బాధ్యులు జన్ను రమేష్, పట్టణ బాధ్యులు సతీష్, మునిసిపాలిటీ, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మిక, వివిధ రంగాల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందీప్



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 21 రోజులు గడుస్తున్నా ప్రభుత్వ విద్యా సంస్థల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవం బాధాకరం అన్నారు. బెస్ట్ డెవలప్‌మెంట్ స్కూల్ స్కీముకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్ల నుంచి నిధులు విడుదల చేయకపోవడంపై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మండలాల వారీగా ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖ అధికారులను నియమించినా ఫలితం శూన్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకులు రాకేష్, వెంకటేష్, రవి, మధు, శివ పాల్గొన్నారు.

నానో యూరియా డ్రోన్ స్ప్రేతో లాభాలు

వర్ధన్నపేట : డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ చేయడం వల్ల రైతులకు అధిక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో నానో యూరియా టెక్నాలజీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గుళికల యూరియా చల్లడం వల్ల 20 శాతం మాత్రమే మొక్కలు అంది 80 శాతం భూసారాన్ని కలుషితం చేయడంతో పాటు గాలిని పొల్యూట్ చేస్తుందన్నారు. అధిక మోతాదులో గుళికల యూరియా వాడటం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశాలున్నట్లు రైతులకు వివరించారు. దుక్కిలో డీఏపీకి బదులు డీఏపీ 500 ఎంఎల్, పైపాటుగా నానో యూరియా నాటు వేసిన నుంచి 20, 40, 60 రోజులకు ఒకసారి మూడుసార్లు స్ప్రే చేసుకుంటే దిగుబడులు పెరుగుతాయన్నారు. శిలీంధ్ర నాశినితో మాత్రం కలిపి వాడరాదన్నారు. డ్రోన్ ద్వారా పెస్టిసైడ్స్ ఎకరం విస్తీర్ణంలో ఆరు నిమిషాల్లోనే పూర్తవుతుందని తెలిపారు. డ్రోన్‌లు నిరుద్యోగ యువత కొనుగోలు చేసి ఉపాధి పొందవచ్చన్నారు. డ్రోన్ కొనుగోలు చేయాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారి చేత సర్టిఫికెట్ పొందాలన్నారు. డ్రోన్‌ను ఇతర పనులకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఇఫ్కో కంపెనీ అధికారి విశాల్, డీలర్లు, యజమానులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కుంటపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

సంగెం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. పల్లారుగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కోడూరి రఘు తండ్రి లింగయ్య ఇటీవల మృతి చెందాడు. కుంటపల్లిలో ముత్తినేని వినోద కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీకోజీనాయక్ తండా శివారు సపావట్ తండాలో బాదావత్ బొంద్యా, కుంటపల్లిలో దడిడెల మొగిలయ్యల పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వర్ధన్నపేట : పట్టణ కేంద్రానికి చెందిన కొండేటి త్రివేణి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరి వెంట స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.

నర్సంపేట : చెన్నారావుపేట భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు కందికొండ రాజు(35) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బండి ఉపేందర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే చెన్నారావుపేట కాంగ్రెస్ నాయకుడు రాజు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండకు చెందిన దబ్బెట లక్ష్మి ఇటీవల మృతి చెందగా బుధవారం దశదినకర్మ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

విచ్చలవిడిగా గుడుంబా అమ్మకాలు

నర్సంపేట : చెన్నారావుపేట గ్రామంలోని నంబర్ వన్ కాలనీలో విచ్చలవిడిగా గుడుంబా అమ్మకాలు చేపడుతున్నారని ఫ్రెండ్స్ యూత్ బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ నంబర్‌వన్ కాలనీలో గుడుంబా అమ్మకాలు చేపట్టడం వల్ల కొంతమంది గుడుంబాకు బానిసలై అనారోగ్యాల పాలై ప్రాణాలు సైతం కోల్పోతున్నారన్నారు. గుడుంబా అమ్మకాలు చేపట్టే వారిపై ఎక్సైజ్ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాగునీటికి 'కొండా' సహాయం

గీసుకొండ: మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్‌లో తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి తన సొంత ఖర్చులతో బోరు వేయించారు. బుధవారం రూ. 2 లక్షలతో బోరు వేయించి మోటార్ బిగించి నీటిని అందిచండంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కొండా మురళి ఆదేశాల మేరకు రడం భరత్, పలువురు ఆయన అభిమానులు ఈ పనులను చేపట్టారు.

మొహర్రం ఉత్సవాలకు ఎస్‌ఆర్‌ఆర్ చేయూత

రాయపర్తి: మండలకేంద్రంలో మొహర్రం పండగ ఉత్సవాల కోసం ముస్లింలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.10వేల పంపించినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్ తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన గడ్డం రాజ్‌కుమార్‌కు రూ.5వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఆర్థికసాయం అందించిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, శ్రీనివాస్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, బాలరాజు, రవీందర్‌రెడ్డి, నర్సయ్య, రాంచందర్, సుధాకర్, రాము, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి



తండాలో నిరసన తెలుపుతున్న తండావాసులు

ఖానాపురం : మండలంలోని వేపచెట్టుతండాలో రోడ్డుపై నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్డుపై నీరు నిలిచి ఎటువైపు వెళ్లకుండా రోడ్డుపైనే నిలుస్తుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని తండావాసులు ఈర్య, సుమన్, రవి, సీతారాంలు బుధవారం రోడ్డుపై నిలిచిన నీటివద్ద నిరసన తెలిపారు.

'అహంకారంతో మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు'

వర్ధన్నపేట : అహంకారంతో మాట్లాడితే ప్రజలు కచ్చితంగా బీఆర్ఎస్ నాయకులకు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బుద్ధి చెబుతారని ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ మండల, బ్లాక్ అధ్యక్షులు సత్యనారాయణ, రాజిరెడ్డిలు విమర్శించారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. దయాకర్‌రావు పాలకుర్తి, వర్ధన్నపేటలను అభివృద్ధి చేశాడని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. ఎమ్మెల్యే నాగరాజు గెలుపుపై బీఆర్ఎస్ నాయకులు అవహేళనగా మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్ల గెలుస్తామని బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. టౌన్ ప్రెసిడెంట్ సురేష్, ప్రభాకర్ గౌడ్, శివకుమార్, రాజు, రాకేష్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

- తహసీల్దార్ రాజ్‌కుమార్



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

నెక్కొండ : ప్రభుత్వ, చెరువు శిఖం భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజ్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం నాగారం గ్రామానికి చెందిన కొందరు రైతులు గ్రామశివారు మొర్రోల్లకుంట చెరువు శిఖం భూమి ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెరువు శిఖం కింద 20 మంది రైతులకు చెందిన భూమి పారకం సుమారు 100 ఎకరాలు ఉందన్నారు. సుమారు 20 ఎకరాల భూమి భూక్య వెంక్యా, గుగులోతు కస్నా, గుగులోతు జగన్, బానోతు చంద్రు, దరావతు సురేశ్, బానోతు శ్రీను, ఇస్లావతు చందు అక్రమంగా సుమారు 20 ఎకరాల భూమిని కబ్జాకు పాల్పడ్డారన్నారు. నాలుగు రోజుల నుంచి జేసీబీ సహాయంతో ట్రాక్టర్లతో మట్టిని తరలించి సాగు చేస్తున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు శీలం వెంకన్న, రాములు, యాదగిరి, ఐలయ్య, ఉంద్రాతి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలి

- ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్



బురదలో కూర్చుని నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నర్సంపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలో బురదలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించేందుకు డివిజన్ పరిధిలోని నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట, పాకాల, కొత్తగూడ, గూడూరు మండలాల నుంచి అడ్మిషన్ పొందేందుకు వస్తున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం సమయంలో కళాశాల భవనం పాతది కావడంతో విద్యార్థులపై పెచ్చులు పడుతున్న సందర్భాలు అనేకమని తెలిపారు. కలెక్టర్ స్పందించి కళాశాల నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినయ్, రాము, రఘు, ప్రమోద్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



నల్లబెల్లి : బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్తున్న భక్తులు

నల్లబెల్లి : మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లి బోనాల పండుగను బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ముదిరాజ్ జెండాను కులపెద్దలతో కలిసి ఆ సంఘం నల్లబెల్లి అధ్యక్షుడు పాండవుల రాంబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పిట్టల ప్రవీణ్, కార్యదర్శి జక్కుల కుమార్, కోశాధికారి గుండాల కుమారస్వామి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీరన్నకు బోనాల సమర్పణ

ఖానాపురం: మండలంలోని రంగాపురంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సంఘం బాధ్యులు బీరన్నకు బోనాలను సమర్పించారు. ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాబురావు, కొమ్మాలు, అశోక్, బందారపు శ్రీనివాస్‌గౌడ్, సదయ్య, రవి, కులపెద్దలు పాల్గొన్నారు.

చలపర్తిలో ఘనంగా వనభోజనాలు

దుగ్గొండి : మండలంలోని చలపర్తి గ్రామంలో పూసల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. మొదట స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వన దేవతలకు మొక్కులు చెల్లించి కోళ్లు, మేకలు బలిచ్చారు. కార్యక్రమంలో పూసల కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదరకోల కృష్ణ, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ప్రశాంత్, కుమారస్వామి పాల్గొన్నారు.

'ఏడాదిన్నరలో ఎలాంటి అభివృద్ధి లేదు'



బీఆర్ఎస్ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ యాదగిరి, కుమారస్వామి

వర్ధన్నపేట : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిన్నర పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ చింతల యాదగిరి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి విమర్శించారు. బుధవారం మండలంలోని బండౌతపురం, రామవరం ఎంపీటీసీ పరిధిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ గ్రామాల్లో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే కనబడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జ సంపత్‌రెడ్డి, వేణుగోపాల్ రావు, కుమారస్వామి, మాధవరావు, శ్రీనివాస్, ఉప్పలయ్య, వెంకటరెడ్డి, ప్రవీణ్ లత, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మకు పూజలు



వర్ధన్నపేట : ఇల్లంద మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో కట్టమైసమ్మ తల్లికి ముదిరాజ్‌లు ప్రత్యేకపూజలు చేశారు. బుధవారం గ్రామంలోని ముదిరాజ్‌లు, గంగపుత్రులు వనభోజనాలకు తరలివెళ్లారు. తల్లి దీవెనలు తీసుకుని వనభోజనాలకు వెళ్లినట్లు భాస్కర్, కుమారస్వామి తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామ నుంచి దీక్షకుంట వయా దుబ్బతండా వరకు రూ.2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ఎల్లయ్యగూడెం నుంచి బాపునగర్ వరకు రూ.2.60 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ఎల్లయ్యగూడెం నంబర్ టు కాలనీ నుంచి అవుసలితండా వరకు రూ.2.90 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాపయ్యపేట నుంచి అయోధ్యపురం వరకు రూ.4.50 కోట్లతో బీటీ రోడ్డు పునరుద్దరణ పనులు, అమీనాబాద్ నుంచి శంకరంతండా వరకు రూ.90 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు, గొల్లపల్లి నుంచి ఈర్యతండా వరకు రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ఈర్యతండా క్రాస్‌రోడ్డు నుంచి బాల్యానాయక్‌తండా వరకు రూ.కోటి 50లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. చెన్నారావుపేట నుంచి కేసముద్రం రోడ్డు(తిమ్మరాయినిపహాడ్) క్రాస్ రోడ్డు నుంచి చంద్రుతండా వరకు పూర్తయిన బీటీ రోడ్డు,



నర్సంపేట : బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ నుంచి సంగెం రోడ్డు(చంద్రుగొండ క్రాస్ నుంచి గొల్లపల్లి వరకు) పూర్తయిన రోడ్డు, జల్లి నుంచి లింగగిరి వరకు పూర్తయిన రోడ్డు పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ బీటీ రోడ్ల నిర్మాణంతో గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయన్నారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తహసీల్దార్ దిలావర్ మహమ్మద్ ఆబిద్‌అలీ, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు సిద్దన రమేష్, రమేష్, శ్రావణ్‌కుమార్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

నెక్కొండ : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన పూర్తయిన చంద్రుగొండ బీటీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రుగొండ క్రాస్‌రోడ్డు నుంచి గొల్లపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ బైపాస్ రోడ్డు నుంచి నెక్కొండ చెరువు కట్ట మీదుగా వయా పత్తిపాక మీదుగా సాయిరెడ్డిపల్లి వరకు రూ. 4.30 కోట్లు, సూరిపల్లి నుంచి చిన్నకొర్పోలు వరకు రూ. 2 కోట్ల వ్యయంతో బీటీ రోడ్లు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. నెక్కొండ చెరువు కట్టను అభివృద్ధి పరచడంతోపాటు మినీ ట్యాంక్‌బాండ్‌గా తీర్చిద్దేందుకు కృషి చేస్తామన్నారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, సూరిపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఘంటా దామోదర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944